క్లుప్తంగా

పొంచి ఉన్న ప్రమాదం



కడవకుదురు-ఇంకొల్లు రోడ్డు ఇలా...

చినగంజాం: మండలంలోని కడవకుదురు గ్రామం నుంచి ఇంకొల్లు వెళ్లే మార్గంలో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని చినగంజాం మండలం కడవకుదురు గ్రామం నుంచి ఇంకొల్లు మండలంలోని ఇంకొల్లు గ్రామానికి వెళ్ళే మార్గంలో ఎప్పుడు ఏం జరుగుతుందో అర్థం కావడంలేదు. ఈ మార్గంలో సైఫన్ వద్ద నుంచి పలు ప్రాంతాల్లో పెద్ద గుంతలు ఏర్పడటంతో పాటు రోడ్డు మార్జిన్‌లు కోతకు గురయ్యాయి. వాహనాల్లో ప్రయాణాలు సాగించాలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొమ్మమూరు కాలువపై ఉన్న వంతెన, అప్రోచ్ రోడ్డు గుంతలు ఏర్పడి ప్రమాదంగా మారాయి. ముఖ్యంగా ఏరువాక మొదలైన ప్రస్తుత తరుణంలో రైతులు పొలం పనులకు వెళ్ళి తిరిగి వచ్చే మార్గాల్లో రక్షణ లేకుండా పోయింది. చినగంజాం గ్రామంలోని గ్రామాలు చింతగుంపల, గొనసపూడి గ్రామాలకు వెళ్ళేందుకు కూడా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వంతెనల వద్ద మార్జిన్‌లు పూర్తిగా కోతకు గురవడంతో రాత్రిళ్ళు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహన దారులు ఏ మాత్రం ఆదమరచినా ప్రాణాలు గాల్లో కలిసి పోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు ఈ మార్గంలో పొంచి ఉన్న ప్రమాదాలను గుర్తించి మరమ్మతులు చేయాలని ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని రెండు మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం శ్రవణం నక్షత్రం చవితి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శనివారం తెలిపారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నకిలీ.. మకిలీ!

- ఆరంభమైన ఖరీఫ్ సీజన్
- ముమ్మరంగా సాగుతున్న వ్యవసాయ పనులు
- విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు ఇదే అదను
- నకిలీ విత్తనాలతో జాగ్రత్త
- గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాల నుంచే ఎరువులు కొనుగోలు



బల్లికురవలో దుక్కిదున్నతున్న రైతు

అద్దంకి: ఖరీఫ్ సీజన్ వచ్చేసింది. వారం ముందుగానే రుతుపవనాలు ప్రవేశించాయి. ఏరువాక పౌర్ణమి రావడంతో రైతులు వ్యవసాయ పనిముట్లను ఎద్దులను పూజించి సాగుకు సిద్ధమయ్యారు. నాగలితో దుక్కులు దున్నడం, భూముల్లో ఎరువులు చల్లడం వంటి పనులు చేస్తున్నారు. వాతావరణం అనుకూలిస్తే మరో 15 నుంచి 20 రోజుల్లో రైతులు తమ పొలాల్లో విత్తనాలను చల్లేందుకు భూములను సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విత్తనాలు ఎరువులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే సమయంలోనే నాణ్యమైన విత్తనాలు ఎరువులు కొనుగోలు చేయకుంటే నకిలీ కంపెనీల ఎరువులు విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవాల్సి ఉంటుందని వ్యవసాయ అద్దంకి నియోజకవర్గంలోని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అధీకృత డీలరు వద్దే కొనుగోలు

నకిలీ కంపెనీల ఆకర్షణీయమైన ప్రకటనలు చూసి మోసపోయి వారి ఉత్పత్తులను కొనవద్దని అధికారులు చెబుతున్నారు. గుర్తింపు పొందిన కంపెనీల నుంచి కొనాలని హెచ్చరిస్తున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో అధికంగా కంది సాగు చేసే అవకాశం ఉంది. అదేవిధంగా మొక్కజొన్న, మిరప, పత్తి, కూరగాయల పంటలను సాగు సాగు చేయనున్నారు. ఐదు మండలాలకు గాను కొరిశపాడు, అద్దంకి మండలాల్లో కంది పంటను సాగు చేసేందుకు రైతులు విత్తనాలు కొనుగోలులో నిమగ్నమయ్యారు. ఈ సంవత్సరం నియోజకవర్గంలో 20వేల ఎకరాలకు పైగానే కంది సాగు చేసే అవకాశం ఉంది అని అంచనా వేస్తున్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ ఆరంభానికి ముందే కంది విత్తనాలు రాయితీపై అందజేసేవారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత రైతుకు రాయితీపై విత్తనం అందించే విధానానికి తిలోదకాలు ఇచ్చారు. దీంతో రైతులు విత్తనాలను దుకాణాల నుంచి కొనుగోలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు వ్యాపారులు తక్కువ ధరకే మంచి విత్తనాలు ఇస్తున్నామని వీటిని నాటితే అధిక దిగుబడులు పొందవచ్చుననే మాటలు నమ్మితే మోసపోయినట్లే. గతంలో సంతమాగులూరు, జె. పంగులూరు, బల్లికురవ మండలాల్లో నకిలీ విత్తనాలు తో రైతులు నష్టపోయిన సందర్భాలు ఉన్నాయి. కాబట్టి రైతులు విత్తనాలు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో అనుమతి పొందిన కంపెనీల నుంచే ఎరువులు విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

జాగ్రత్తలు ఇవే..

వ్యవసాయ శాఖ నుంచి లైసెన్సు పొందిన అధీకృత డీలర్ నుంచే విత్తనాలు ఎరువులు కొనుగోలు చేయాలి. బిల్లుపై విక్రయదారుని పేరు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అమ్మక పన్ను నంబరు, రైతు గ్రామం పేరు, విక్రయదారి సంతకం, తేదీ, నికర ధర, కంపెనీ పేరు ఉన్నాయో లేదో చూసుకోవాలి. లూజుగా ఉన్న.. సంచులు చిరిగిపోయిన సంచులు, సీల్ తీసిన డబ్బాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయవద్దు. కొనుగోలు చేసే సమయంలో ప్యాకెట్‌కు సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.

విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లును పంట పండే వరకు భద్రపరుచుకోవాలి. మొలకెత్తే దశ పూత దశ పంట దశల్లో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి.

ఎరువులు అయితే మిషన్ కుట్టుతో ఉన్న సంచుల్లో మాత్రమే కొనుగోలు చేయాలి. చేతికట్టుతో ఉన్న సంచులను కొనుగోలు చేయరాదు. గ్రామానికి పోషక వివరాలు, ఉత్పత్తిదారు సంస్థ పేరు, ఉత్పత్తిదారు పేరు ఉంటేనే కొనుగోలు చేయాలి. ఎరువులు సంచుల్లో కొనుగోలు చేసిన ఎదుగుతో పాటు అన్య పదార్థాలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయదు చేయాలి. వ్యవసాయ శాఖ ఉద్యాన శాఖ కలపవచ్చు అని చెప్పిన పురుగు మందులు మాత్రమే కలిపి పిచికారీ చేయాలి. ఖాళీ పురుగుమందు డబ్బాలను ధ్వంసం చేసి గోతుల్లో పూడ్చిపెట్టాలి. పురుగు మందులు కలపడానికి వాడిన పాత్రలను ఇంట్లో ఉపయోగించకూడదు.

> **బిల్లు తప్పనిసరి**
>
> రైతులు విత్తనాలు ఎరువులు అధీకృత డీలరు వద్దే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాలు ఎరువులకు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. అందులో పొందుపరచాల్సిన సమాచారం ఉందో లేదో సరిచూసుకోవాలి. ఏదైనా తేడా వస్తే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.
>
> – ఏడీఏ ధన్‌రాజ్

సమస్యల పరిష్కారం ముఖ్యం



ఎస్టీఓను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

అద్దంకి: విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సంఘం పనిచేస్తుందని విశ్రాత ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు బాపయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశంలో శనివారం పట్టణంలోని ఉద్యోగుల విశ్రాంత భవనంలో నిర్వహించారు. సమాసవేశంలో విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. సమావేశానికి జిల్లా సంఘ అధ్యక్షుడు బాపయ్య చౌదరి ముఖ్య అతిథులుగా కార్యదర్శి కరి కమలేశ్వరరావు, కోశాధికారి పట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, సమావేశం అద్దంకి శాఖ అధ్యక్షుడు అడుసుమల్లి అనంత కోటేశ్వరరావు ఆధ్యక్షతన నిర్వహించారు. అద్దంకి నుంచి బదిలీపై వెళ్లిన ప్రసన్న, సీనియర్ అసిస్టెంట్ కొండలరావు, బదిలీపై వచ్చిన ఎస్టీవో ఖాదర్ బాషాను సంఘ నాయకలు ఘనంగా సన్మానించారు. సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో జీవించాలి



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న రూరల్ సీఐ శేషగిరిరావు

చీరాల: రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి జీవించాలని చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. శనివారం చీరాల రూరల్ సీఐ కార్యాలయంలో ఈపూరుపాలెం, వేటపాలెం పరిధిలోని రౌడీ షీటర్లుకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర ప్రవృత్తి వదిలి ప్రశాంతంగా జీవించాలన్నారు. ప్రతి శనివారం ఆయా పోలీస్‌స్టేషన్లలో హాజరుకావాలన్నారు. నేరపూరిత సంఘటనలకు దూరంగా ఉండాలని, ప్రతి ఒక్కరిపై నిఘా ఉంటుందని హెచ్చరించారు. ఈపూరుపాలెం ఎస్సై ఎ.చంద్రశేఖర్, వేటపాలెం ఎస్సై జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు రద్దు.. ప్రయాణికుల పాట్లు



ఆటోల్లో ప్రయాణికులు

బల్లికురవ: చిలకలూరిపేట డిపో నుంచి మార్టూరు, వలపర్ల, రామకూరు, వైదన, నాగులవరం మీదుగా వినుకొండ వెళ్లే బస్సును వారం నుంచి రద్దు చేశారు. టార్గెట్ ప్రకారం కలెక్షన్లు రావడం లేదని సింగల్ రూట్‌ల్లో తిరిగే ఉన్న బస్సులనే రద్దు చేశారు. దీంతో మార్టూరు, పంగులూరు, బల్లికురవ, చిలకలూరిపేట, మునిసిపాలిటీ పరిధిలోని ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు దశాబ్దాల నుంచి ఈ మార్గంలో తిరుగుతున్న బస్సుకు కలెక్షన్లు రావడం లేదనే సాకుతో రద్దు చేశారు. మహిళకు ఉచిత ప్రయాణం ఏర్పాటు చేస్తున్నామని ఓ వైపు ఊదర గొడుతూ మరో వైపు ఉన్న బస్సునే రద్దు చేయడంతో ప్రయణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు. బల్లికురవ, మార్టూరు మండలాల్లోని ప్రయణికులు చిలకలూరిపేట ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పురుద్ధరించాలని వేడుకుంటున్నా ఎవరూ స్పందిచడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. బల్లికురవ మండలంలోని అద్దంక ఇనుంచి వైదన మీదుగా చిలకలూరిపేటకు వెళ్లే బస్సును సైతం కలెక్షన్ రావరడం లేదని ఒక ట్రిప్పుకు పరిమతం చేశారు.

వెలుగు సీసీగా శ్రీనివాసరావు

మేదరమెట్ల: కొరిశపాడు మండలం క్లస్టర్ వెలుగు సీసీగా తుళ్ళూరి శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన అద్దంకి మండలం మోదేపల్లి క్లస్టర్‌లో పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కొరిశపాడు క్లస్టర్ వెలుగు సీసీగా పనిచేసిన మేరీ కుమారి నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం క్లస్టర్ సీసీగా బదిలీపై వెళ్లారు.

ఘనంగా రక్తదాన దినోత్సవం



మార్టూరులో రక్తదానం చేస్తున్న స్థానికులు



రక్తదానం చేస్తున్న బ్రహ్మకుమార్, కుక్కల వెంకట కృష్ణారెడ్డి

చినగంజాం: అంతర్జాతీయ రక్తదాన దినోత్సవాన్ని చినగంజాంలో శనివారం ఘనంగా నిర్వహించారు. చినగంజాం బ్రహ్మకుమారీస్ గీతా పాఠశాల తరపున బ్రహ్మకుమార్ కుక్కల వెంకట కృష్ణారెడ్డి రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆయనతోపాటు పలువురు రక్తదానం చేసిన వారిలో ఉన్నారు. ఒంగోలు రెడ్ క్రాస్ సొసైటీ తరపున మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయకృష్ణ, అకౌంటెంట్ కందుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రక్తదానం పునర్జన్మతో సమానం

మార్టూరు: దాతలు ఇచ్చే రక్తంతో వేరొకరికి పునర్జన్మ ఇచ్చినట్లేనని ప్రతి ఒక్కరూ సంవత్సరానికి ఒకటి లేదా రెండు సార్లు రక్తదానం ఇస్తే ఆరోగ్యపరమైన సమస్యలు ఏమి ఉండబోవని మార్టూరు ప్రభుత్వ వైద్యాధికారి అశోక్ రెడ్డి అన్నారు. ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దాతలు చేసే రక్తదానంతో ప్రసవ సమయంలో గర్భిణులకు, ప్రమాదాల బారిన పడి రక్తం కోల్పోయిన వారికి, రక్తహీనత కలిగిన రోగులకు పునర్జన్మను ప్రసాదించినట్లే అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ బాపట్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు 'రక్తం ఇవ్వండి,ఆశను ఇవ్వండి, మనం దరం రక్తదానం చేసి ప్రాణాలు కాపాడుదాం', అనే నినాదాన్ని క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ డీసీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. కె దుర్గ, ఎం. సామ్రాజ్యం, శ్రీనివాసరావు, ఎల్టీ వసంత, జోసెఫ్ పాల్గొన్నారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



చందన అలంకార దృశ్యం

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామం అద్దంకి రోడ్డులో గల భూనీల సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 41వ వార్షిక బ్రహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం స్వామివారిని చందన అలంకారంతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శేషవాహనంపై స్వామివారిని ఉంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. బ్రహోత్సవాల్లో భాగంగా ఈనెల 19వ తేదీ వరకు స్వామివార్లను వివిధ అలంకారాలతో అలంకరించి పూజలు నిర్వహించడం.. సాయంత్రం వేళ గ్రామోత్సవాన్ని ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఆశ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

చినగంజాం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో మూడు ఆశ కార్యకర్తలు పోస్టులు ఖాళీగా ఉన్నందున అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని వైద్యాధికారి పి. సాయి శ్రీచరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యం కేంద్రం పరిధిలోని కొత్తపాలెం, మున్నం వారిపాలెం, రాజుబంగారు పాలెం సచివాలయాల పరిధిలో అర్హులైన వారు ఈ నెల 17వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన వారు ఆయా సచివాలయాల పరిధిలోని వారై ఉండాలని.. దరఖాస్తుల కోసం ఆస్పత్రి సూపర్‌వైజర్‌ను సంప్రదించాలని కోరారు.

క్షయవ్యాధి ప్రమాదకరం

చీరాల రూరల్: క్షయవ్యాధి అంటు వ్యాధని నిర్లక్ష్యం వహిస్తే ఒకరినుంచి మరొకరికి వ్యాధిసోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఈపురుపాలెం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ జ్యోతిర్మయి అన్నారు. 100 రోజుల ముక్తి భారత్ అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం చీరాల టీబీ యూనిట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వాడరేవు, బుర్లవారిపాలెం క్షయవ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ జ్యోతిర్మయి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం వస్తున్నా, నిత్యం జలుబు చేస్తున్నా టీబీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయవ్యాధి ఉన్నవారు దగ్గినా, తుమ్మినా వారినుంచి వచ్చే తుంపర్ల వలన ఇతరులకు వ్యాధిసోకే అవకాశాలు ఉంటాయని చెప్పారు. పోషకాహార లోపం ఉన్నవారు, క్షయవ్యాధి కలిగిన కుటుంబ సభ్యులు, ఆర్‌టీపీసీఆర్–క్లై పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రుల్లో అందించే ఉచిత మందులను వైద్యుల సలహాల మేరకు డాట్ పద్ధతిలో మందులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. క్షయవ్యాధి నిర్మూలన సిబ్బంది కె. శ్రీలక్ష్మి మాట్లాడుతూ ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారి సాధిక్ మహమ్మద్ పర్యవేక్షణలో జాయింట్ డైరెక్టర్ రమేష్ ఆదేశాల మేరకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. హెల్త్ సూపర్‌వైజర్ కోటేశ్వరి, మార్తా జయరాజ్, ఎస్‌కే గాలిబ్, ఓసీపీల్లి భవాని, ఎ. భువన, పి. రత్న, ఎం. సుజాత, వై. జయకుమారి, నాగమణి, గాలిబ్, జి. సుప్రియ, పి. పద్మావతి, సీహెచ్. సంధ్యారాణి, పి. నాగేశ్వరమ్మ, పి. మంజుల, దుర్గాప్రసాద్, 104 సిబ్బంది పాల్గొన్నారు.



ఇంకొల్లులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది



పర్చూరులో యోగా నిర్వహిస్తున్న అధికారులు,సిబ్బంది



బల్లికురవ: అవగాహన ర్యాలీ

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

చినగంజాం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 11వ శనివారం చినగంజాంలో గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు ఆధ్వర్యంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. చినగంజాం గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్ హైస్కూల్, అంబేడ్కర్ సెంటర్, చినగంజాం ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మీదుగా ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి యోగాపై అవగాహన కలిగించారు. అనంతరం ఆయా కేంద్రాల్లో యోగా శిక్షణ నిర్వహించారు. 21న జరిగే యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బల్లికురవ: యోగాతో పూర్తి ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని ప్రతి ఒక్కరూ యోగా పట్ల అవగాహన పెంచుకోవాలని మండల పరిషత్ కార్యాలయం ఏవో పాండురంగ స్వామి కోరారు. శనివారం బల్లికురవలో ర్యాలీతో యోగాపట్ల అవగాహన కల్పించారు. ఈ నెల 21వ తేదీ లోపు ప్రతి పంచాయతీలో అవగాహన పెంచుకుని ప్రతి రోజూ 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలన్నారు. వైద్యానికి వేలకు వేలు ఖర్చు చేసే బదులు యోగాతో ఆరోగ్యం సమకూరుతుందన్నారు. ర్యాలీలో గ్రామ పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్, ప్రజలు పాల్గొన్నారు.



చినగంజాంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామ సర్పంచ్ తదితరులు

పర్చూరు(చినగంజాం): యోగా పట్ల ప్రజలు ఆసక్తిని పెంచుకోవాలని ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్ తెలిపారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలకు యోగాపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా చేత ప్లకార్డులు ధరించి ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా చేయాలని, నిత్యం యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గించుకోవచ్చు అని దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయన్నారు. ఈ నెల 21 న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఈఓపీఆర్డీ కె. సత్యనారాయణ, కార్యదర్శి మస్తాన్‌రావు, వీఆర్వో యార్లగడ్డ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు,

ఇంకొల్లు (చినగంజాం): ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవించాలంటే యోగా తప్పనిసరి అని ఎంపీడీఓ జి. శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ యోగాతో ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆనందంగా జీవితాన్ని గడపవచ్చు అన్నారు. రోజుకు 10 నిమిషాలు యోగ చేయడం ద్వారా ఎంతో ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ఇంకొల్లు గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యదర్శి వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.